

గురువారం హైదరాబాద్‌లో టీబీజీకేఎస్ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

# నల్లనేలలో 'గుర్తింపు' పోరు

- ఈ నెల 27న సింగరేణి ఎన్నికలు
- పోటీలో 13 కార్మిక సంఘాలు
- 11 డివిజన్లలో 39,832 మంది కార్మికులు
- టీబీజీకేఎస్ నేతలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిశానిర్దేశం
- సంస్థను కాపాడిన సంఘాన్ని గెలిపించుకోవాలని పిలుపు

గోదావరిఖని, డిసెంబర్ 8 : తెలంగాణలోని ఆరు జిల్లాల పరిధి.. 11 డివిజన్లలో విస్తరించి ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో ఈ నెల 27న గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు జరగబోతున్నాయి. 13 కార్మిక సంఘాలు పోటీ పడుతున్నాయి. సంస్థలో పనిచేస్తున్న 39,832 మంది కార్మికులు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఈ నెల 4న అన్ని కార్మిక సంఘాల నాయకులతో హైదరాబాద్‌లో డిప్యూటీ చీఫ్ లేబర్ కమీషనర్ తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితాను అందజేసిన విషయం తెలిసిందే. సింగరేణిలో నాలుగు సార్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ), రెండు సార్లు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్)లు గుర్తింపు కార్మిక సంఘం హోదాలో కొనసాగాయి. ప్రస్తుతం ఏడవ సారి జరగనున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలుపొందేందుకు సంఘాలు పోటీ పడుతున్నాయి. అక్టోబర్ 19న సింగరేణి ఎన్నికలు జరపాలని డిప్యూటీ చీఫ్ లేబర్ కమీషన్ నిర్ణయించగా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా డిసెంబర్ 27కు వాయిదా వేస్తూ హైకోర్టు తీర్పును ఇచ్చిన విషయం తెలిసిందే.

### 1998లో తొలిసారి ఎన్నికలు

సింగరేణి కాలరీస్‌లో ప్రభుత్వం 1998లో తొలిసారిగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించింది. 1998కి ముందు కంపెనీలో సుమారు 78 కార్మిక సంఘాలు కార్యకలాపాలు నిర్వహించేవి. దీంతో ప్రతీ సంఘంతో యాజమాన్యం సంప్రదింపులు జరపడం ఇబ్బందిగా మారి పారిశ్రామిక సంబంధాలకు విఘాతం కలిగేది. మాటి మాటికి సమ్మెలు జరిగేవి. దీంతో ప్రభుత్వం సింగరేణిలో 1998లో తొలిసారిగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించి గెలిచిన సంఘంతో మా త్రమే సంప్రదింపులు జరపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో తొలిసారి 1998లో ఎన్నికలు నిర్వహించగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) విజయం సాధించింది. అప్పుడు గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి రెండేళ్లు ఉండేది. అనంతరం 2001లో రెండో సారి జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో మళ్లీ అదే యూనియన్ రెండేళ్ల కాలపరిమితితో గెలుపొందింది. మూడవ సారి 2003లో ఎన్నికలు జరగగా మళ్లీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గెలుపొందగా ప్రభుత్వం అప్పుడు నాలుగేళ్ల కాలపరిమితిని నిర్ణయించింది. అనంతరం 2007 లో నాలుగో సారి మళ్లీ అదే సంఘం విజయం సాధించింది. ఈ క్ర మంలో నాలుగు సార్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘంగా కొనసాగింది. 2012లో ఐదవ సారి జరిగిన గుర్తింపు ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) విజయం సాధించింది. అనంతరం 2017 లో జరిగిన ఆరవ సారి గుర్తింపు సంఘం ఎన్నికల్లో మళ్లీ టీబీజీకేఎస్ విజయం సాధించింది. ప్రస్తుతం ఏడవ సారి సింగరేణి ఎన్నికల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతున్నాయి.

### 39,832 మంది ఓటర్లు

సింగరేణిలోని 11 డివిజన్లలో 39,832 మంది సింగరేణి కార్మికులు పనిచేస్తూ ఈ నెల 27న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. బెల్లంపల్లి ఏరియాలో 985 మంది, మందమర్రిలో 4876 మంది, శ్రీరాంపూర్‌లో 9124 మంది, కార్పొరేట్‌లో 1112 మంది, కొత్తగూడెంలో 2370 మంది, ఇల్లందులో 603 మంది, మణుగూరులో 2414 మంది, రామగుండం-1లో 5430 మంది, రామగుండం-2లో 3479 మంది, రామగుండం-3లో 3063 మంది, భూపాలపల్లిలో 5350 మందితో పాటు అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో 944 మంది, నైనిలో ఇద్దరు కార్మికులు పనిచేస్తున్నారు. కాగా సింగరేణిలోని మందమర్రి, శ్రీరాంపూర్, ఆర్జీ-1, భూపాలపల్లి డివిజన్లలో అత్యధికంగా కార్మికులు పనిచేస్తున్నారు. గుర్తింపు ఎన్నికల్లో గెలుపు, ఓటములను నిర్ణయించే ఈ నాలుగు డివిజన్లపైనే కార్మిక సంఘాలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి. గతంలో జరిగిన గుర్తింపు ఎన్నికల్లో ఈ 4 డివిజన్లు గెలుపు బాటలు వేశాయి.

### నేతలతో ఎమ్మెల్సీ కవిత సమీక్ష

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్సీ, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రత్యేకంగా దృష్టి సారించారు. కోల్‌బెల్ట్ ఏరియా టీబీజీకేఎస్ నేతలతో ప్రత్యేకంగా సమీక్షిస్తున్నారు. టీబీజీకేఎస్ అగ్రనేతలు వెంకట్రావ్, మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్యతో ప్రత్యేకంగా భేటీ అయి పరిస్థితులపై దిశా నిర్దేశం చేస్తున్నారు. సింగరేణిలోని భూపాలపల్లి, మణుగూరు, ఇల్లందు, కొత్తగూడెం డివిజన్లకు చెందిన టీబీజీకేఎస్ ముఖ్య నాయకులతో రివ్యూ నిర్వహించారు. క్రమక్రమంగా మిగిలిన డివిజన్ల నాయకులతో సమీక్షలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా సింగరేణిలో వారసత్వపు ఉద్యోగాలు పోగొట్టిన జాతీయ సంఘాల పనితీరును ఎండగట్టాలని, వారసత్వపు ఉద్యోగాలు ఇప్పించిన టీబీజీకేఎస్ గురించి కార్మికులకు వివరించాలని సూచిస్తున్నారు. అదే విధంగా మనం సాధించిన ప్రతీ హక్కును కార్మికులకు అర్థమయ్యేలా చెప్పాలని కోరుతున్నారు. రాష్ట్రంలో పార్టీ ఓటమి పాలైందని ఎవరూ బాధపడవద్దని, అధైర్య పడవద్దని, ఎలాంటి సపోర్టు లేనప్పుడే కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నామని, అదే స్ఫూర్తితో ముందుకు సాగుదామని టీబీజీకేఎస్ నాయకుల్లో కవిత ధైర్యం నింపుతున్నారు. ఓడినా ఎల్లప్పుడూ మీ ముందే ఉంటామని, ప్రజల, కార్మికుల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటామని, పార్టీ కార్యకర్తలు యూనియన్ నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని వెల్లడిస్తున్నారు. తెలంగాణకే తలమానికం అయిన సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని సింగరేణి సంస్థ ఇతర యూనియన్లు, పార్టీల చేతిలోకి వెళ్తే సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని కవిత నాయకులకు తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో పట్టుదలతో ముందుకు సాగాలని ఏరియాల వారీగా ఇన్‌చార్జిలను నియమిస్తామని, త్వరలో మ్యానిఫెస్టోను విడుదల చేస్తామని ఎమ్మెల్సీ కవిత నాయకులకు తెలిపారు. అదే విధంగా సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదేనని చెబుతున్నారు. యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించామని, అదే స్ఫూర్తితో నాయకత్వ బాధ్యతల్లోనూ అత్యంత ప్రాధాన్యత ఇస్తామని హామీనిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చొరవతో సింగరేణి కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాయని, టీబీజీకేఎస్‌ను గెలిపించుకుంటేనే కార్మికులకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. సంస్థను నష్టాల నుంచి కాపాడిన బీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్‌ను కార్మికులు గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావు

# గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావు
- ఆర్జీ-1, 2, 3 ఏరియాల ముఖ్య నాయకులతో సమావేశం

గోదావరిఖని, డిసెంబర్ 8: ఈనెల 27న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని యూనియన్ అధ్యక్షుడు బీ వెంకట్రావు యూనియన్ నేతలకు పిలుపునిచ్చారు. స్థానిక టీబీజీకేఎస్ కా ర్యాలయంలో శుక్రవారం రాత్రి జరిగిన ఆర్జీ-1,2,3 ఏరియాల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేర కు విజయం కోసం శ్రమించాలని సూచించా రు. ఇప్పటికే అనేక హక్కులు సాధించామని గుర్తు చేశారు. మళ్లీ గెలిపిస్తే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశా లు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కారుణ్య నియామకాలు తెలంగాణ ఇంక్రిమెంట్, రూ. 10 లక్షల ఇంటి రు ణంపై వడ్డీ మాఫీ, క్వార్టర్లలో ఏసీ సౌకర్యం ఇతర అనేక హక్కులు సాధించిన ఘనత తమదేనన్నారు. రామగుండంలోని 3 డి విజన్లలో టీబీజీకేఎస్ భారీ మెజార్టీతో గెలుపొందే విధం గా కృషి చేయాలన్నారు .ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు గంధ్ర దామోదర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ఆర్జీ-2,3 ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్, గౌతం శంకరయ్య, నూనె కొంరయ్య, తదితరులున్నారు.



హాజరైన ఆర్జీ-1,2,3 యూనియన్ నాయకులు

## విద్యార్థికి అభినందన

కొత్తపల్లి, డిసెంబర్ 8: మానకొండూర్ మండలం దేవంపల్లిలోని గురుకుల పాఠశాల ఏడో తరగతి విద్యార్థి పురాణం దీపక్ యోగా జాతీయ స్థాయి యోగా ఫెడరేషన్ కప్‌కు ఎంపికయ్యాడు. దీపక్‌ను యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ రవీందర్ సింగ్, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, రామకృష్ణ, కిష్టయ్య, మల్లేశ్వరి, ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, ప్రదీప్‌కుమార్, మనోజ్‌కుమార్, తదితరులు అభినందించారు.

## వీల్ చైర్ అందజేత


శంకరపట్నం, డిసెంబర్ 8: శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన నల్ల మల్లారెడ్డి ప్రమాదవశాత్తు రెండు కాళ్లు కోల్పోయాడు. ఈ క్రమంలో వీల్‌చైర్ కోసం ఆలయ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ గాదె గుణసాగర్‌ను సంప్రదించాడు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఐఏఎస్ పరికిపండ్ల నరహరి రైతు మల్లారెడ్డికి వీల్ చైర్ పంపించారు. ఇక్కడ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్, నేత జీడి రాజు ఉన్నారు.

## కేసీఆర్ కోలుకోవాలని నేడు కొండగట్టులో పూజలు

చొప్పదండి, డిసెంబర్ 8: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొండగట్టు దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

## కార్పొరేటర్‌కు పరామర్శ

కార్పొరేషన్, డిసెంబర్ 8: కరీంనగర్ 2వ డివిజన్ కార్పొరేటర్ కాశెట్టి లావణ్య-శ్రీనివాస్ అత్తమ్మ కాశెట్టి రంగమ్మ ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, బీఆర్ఎస్ మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి యాదగిరి, నాయకుడు శంకర్ ముదిరాజ్ ఉన్నారు.



రంగమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

## ఉచిత వైద్య శిబిరం

విద్యానగర్, డిసెంబర్ 8: నగరంలోని 19వ డివిజన్ (విజయపురికాలనీ)లోని విశ్వబ్రాహ్మణ సంఘంలో కార్పొరేటర్ ఏదుల్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో సన్ షైన్ దవాఖాన సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యురాలు అపూర్వ పరీక్షలు చేసి, అవసరమున్న వారికి మందులు అందజేశారు. దవాఖాన సిబ్బంది కిరణ్ కుమార్, సాగర్, సంఘం ప్రెసిడెంట్ దేవోజు రవీంద్రా చారి, జనరల్ సెక్రటరీ వామనచారి, క్యాషియర్ శంకరాచారి, రావుల భాస్కరాచారి, దేవోజు ప్రభాకర్, కే కిరణ్ పాల్గొన్నారు.

## పరీక్ష ప్యాడ్ల పంపిణీ

శంకరపట్నం, డిసెంబర్ 8: మండల కేంద్రంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకుడు, రిటైర్డ్ టీచర్ గంగిశెట్టి జగదీశ్వర్, కేజీబీవీ ఎస్‌వో మాధవి, మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 8: తిమ్మాపూర్‌లోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్ష సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ నుంచి 30 రోజుల పాటు పురుషులకు హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.